ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక
జూన్ 2018
సంపుటి : 24 **281** సంచిక : 6

అష్టైశ్వర సంపన్నుడైన భగవంతుడు తన అష్టైశ్వర్యములను మానవునికే ప్రసాదించాడు!

-అయినా మానవుడు మాయకు లోనై పరిపూర్ణ ఆనందాన్ని అనుభవించలేకపోతున్నాడు-

అష్టైశ్వర్య స్వరూపుడైన భగవంతుడు అష్టైశ్వర్యములను మానవునికే యిచ్చాడు. అవే వన:జలం ఆయన జలంలో ఉంటున్నందువలన ఆ జలమునే ముందు మనకిచ్చాడు. జలస్వరూపునిగా సాక్షాత్కరిస్తున్నాడు.

రెండవది అగ్ని

రెండవది అగ్ని చేతన సమస్తమూ వికసిస్తూ, ప్రకటిస్తూ, ప్రదర్శిస్తూ, ప్రభ విస్తున్నది. మానవుడు అట్టి అగ్ని ద్వారా ఆహారమును పక్వము చేసి భుజిస్తు న్నాడు. ఆ ఆహారసారము రక్తముగా మారి మాంసము, కండలు, ఎముకల వంటి సప్తధాతువులుగా శరీరానికి బలం కూరుస్తున్నవి.

మూడవది భూమి

ఈ భూమిపైననే సకల జీవరాశులు పుట్టి, జీవించి లయమవుతున్నాయ్. ఆహార పదార్థములన్నీ భూమి ద్వారానే లభ్యమవుతున్నాయ్. జనన, జీవన, మరణములన్నీ భూమిపైననే జరుగుతున్నాయ్.

నాలుగవది గాలి

క్షణక్షణమూ మనము గాలిని పీల్చుకుంటూ, వదులుతున్నాం. ఉచ్ఛ్వాశ్వ నిశ్వాసములన్నీ గాలి ద్వారానే శ్వాసప్రక్రియను జరుపుతున్నాయి. శ్వాసలేని మనిషి ప్రాణం కోల్పోయాడనీ, ఇహలోక విముక్తి పొందాడనీ దహనపరుస్తు న్నాం. లేదా భూమినందు పూడ్చుతున్నాం.

ఐదవది ఆకాశము

ఆకాశము సర్వప్రాణులకు జీవిత వికాశము అందిస్తున్నది. అట్టి ఆకాశము యొక్క గుణము శబ్దము. శబ్దమూ, కాంతి లేకుండా విహీనం అవుతాడు. తత్కారణంగా వినిపించదు. కనిపించదు.

ఆకాశముపైన ఉన్నదని భావిస్తాము. కానీ పైన ఉన్నది తెల్లని మేఘాలు, నీలి మబ్బులే. శూన్యము ఆకాశము.

ఆరవది సూర్యుడు

సూర్యుడు చీకటిని చీల్చకలుగుతున్నాడు. వెలుగును ప్రసాదిస్తున్నాడు. సమస్త ప్రాణులూ సంచరించకలుగుతున్నాయ్. ఆహారము సంపాదించుకో కలుగుతున్నాయ్. మల విసర్జనలు చేయగలుగుతున్నాయ్.

ఏడవది చంద్రుడు

చంద్రుని తత్త్వమూ, వెన్నెల. వెన్నెల తరల వికాసమే మానవుణ్ణి శాంత పరుస్తున్నది. మనసున చల్లదనము, ప్రశాంతత కూరుస్తున్నది.

సినిమా పాటల్లో కూడా చల్లని రాజా ఓ చందమామా! నీ కథలన్నీ తెలిసాయి చందమామా' వంటి పాటలూ, చిన్నిచిన్న పాపలు చంద్ర బింబాన్ని చూసి ఆనందించడమే కాకుండా బువ్వను గోముగా తినకలుగుతున్నారు. కొత్త జంటలు, భార్యాభర్తలు ఆనంద సౌభాగ్యాలను చూడకలుగుతున్నాయ్. శాస్త్రజ్ఞులు చంద్రలోక ప్రయాణం చేయాలని ప్రయత్నాలు పరిశోధనలు చేస్తున్నారు.

గాకపోయిననూ సూర్యుడు నుండీ భూమి వచ్చింది. భూమి నుండి చంద్రు డుద్భవించాడు. సూర్యుడూ, చంద్రుడూ ఒకే పదార్థము యొక్క ప్రతిరూపములనీ తేల్చారు శాస్త్రవేత్తలు. సూర్యుడు తూర్పు దిశలో ఉంటే చంద్రుడు పడమటి దిశలో ఉంటాడు. ఇరువురూ వెలుగుకర్తలే. వారొక దిశలో ఒకే కాలమున దర్శనమివ్వరు.

ఎనిమిదవది వేద ప్రమాణము

వేదమే సత్యము. వేద ప్రమాణమే సత్యం. 'సత్యన్నాస్తి పరోధర్మః' అన్నారు. సత్యస్వరూపుడైన భగవంతుడు నిత్యుడై, నిరాకారుడై, విశ్వంలో (జగత్తులో) ఆవిర్భవిస్తూంటాడు. నిజానికాయన ఉనికిలేని స్థానం లేదు. అట్టి భగవంతుణ్ణి అష్టవిధా స్వరూపముగా విశ్వసిస్తూ ఈతిబాధలకు స్వస్తి పలుకుదాం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రేమే దైవం. Love is God సర్వజగత్తును ప్రేమించే విధానాన్ని భగవంతుడు వేద ప్రమాణంగా చెప్పాడు. ఇలా అష్టవిధాలా భగవంతు ణ్ణారింగి కొలిచినవారికి ఏ బాధలూ ఉండవు. అష్టైశ్వర ప్రసాదితుడవైన నమోస్తు! శాన్తిరస్తు. సుస్థిరస్తు, శుభమస్తు.



బుధజన విధేయుడు
- గోటేటి శ్రీరామారావు

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

మేటి పత్రికా రచయిత మరపురాని మహాపండితుడు తిరుమల రామచంద్ర

భాషావేత్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడుగా, పత్రికా రచయితగా, వ్యాసకర్తగా, పండితుడుగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, బహుభాషా కోవిదుడుగా తిరుమల రామచంద్ర ఎనలేని పేరు ప్రఖ్యాతులు గడించారు. ఇరవయ్యో శతాబ్ది తెలుగు విద్వత్ జగత్తులో ఆయన అద్వితీయుడు. భాషా, వ్యాకరణం, సాహిత్యం, లిపి, విజ్ఞానం, సంస్కృతి వికాసం, తులనాత్మక భాషా శాస్త్రం లాంటి అనేక అంశాల్లో అసాధారణ ప్రతిభాశాలి. తిరుమల రామచంద్ర 1913 జూన్ 17న అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా తాడిపత్రి దగ్గర రాంగపల్లె అనే అగ్రహార గ్రామంలో మాతామహుల ఇంటిలో జన్మించారు. జానకమ్మ, శేషాచార్యులు వీరి తల్లిదండ్రులు. తన మాతామహునికి ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు అనీ, అంతపెద్ద కుటుంబంలో మొట్టమొదట కలిగిన మగ సంతానం తానే నని, అందువల్ల మాతా మహుల ఇంట్లో అల్లారుముద్దుగా శైశవం గడిచిందని తిరుమలవారు చెప్పారు. తనకు నాలుగేళ్ళు నిండేవరకు తల్లిదగ్గరే ఆమె పుట్టింట్లోనే వున్నానన్నారు. ఐదో ఏడు వచ్చిన తర్వాత కమలాపురం వెళ్ళి అక్కడే తన ప్రాథమిక విద్యాభ్యాసం ప్రారంభమైందని రామచంద్రగారు అన్నారు.

తిరుపతి సంస్కృత కళాశాలలో ఆయన ఎనిమిదేళ్లు చదువుకున్నారు. నెల్లూరు సంస్కృత కళాశాలలో కూడా చదివారు. విద్యార్థి దశలోనే సత్యాగ్రహం పాల్గొని రాయ వెల్లూరు, తిరుచినాపల్లి జైళ్లలో వున్నారు. సహాయనిరాకరణ సభలకు సంస్కృతంలో 'మార్చింగ్ సాంగ్' రాశారు. ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలో సైన్యంలో హవల్దార్ గుమస్తాగా అఫ్ఘానిస్తాన్ బెలూచిస్తాన్ సరిహద్దులో పనిచేశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక సభల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమర యోధునిగా మద్రాసు కుట్ర కేసులో ముద్దాయిగా జైలు అనుభవించారు. సంస్కృతంలో 'సాహిత్య శిరోమణి', తెలుగు సంస్కృత భాషల్లో 'విద్వాన్' హిందీలో 'ప్రభాకర్' లాంటి డిగ్రీల్ని వీరుపొందారు. 1939 మే 7వ తేదీన అనంతలక్ష్మితో వివాహం అయింది. ఆయనకు నీరజ, ఆముక్తమాల్యద, శేషసాయి ముగ్గురు పిల్లలు. 1939లో మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో కాపీయిస్టుగా ఉద్యోగం ప్రారంభించారు. వీరి జీవితంలో పెద్ద మలుపు అక్కడే జరిగింది. ప్రముఖ విమర్శకులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారితో పరిచయం. తాను ప్రభాకరశాస్త్రిగారికి ఏకలవ్య శిష్యుడని చెప్పుకున్నారు. తర్వాత తంజావూరు సరస్వతీమహలు (1933-38)లో పండితుడిగా పనిచేశారు. అక్కడ మానవల్లి రామకృష్ణకవితో పరిచయం అయింది. పిదప లాహోరు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట లైబ్రరీలో పండితుడుగా చేరారు.

ఢిల్లీలో 'డెయిలీ టెలిగ్రాఫ్' ఆంగ్ల పత్రికలో పనిచేశారు. అడవి బాపిరాజుగారి సంపాదకత్వంలో వచ్చిన 'మీజాన్' (1944-47) పత్రికలో బాధ్యతలు చేపట్టారు. రాంభట్ల కృష్ణమూర్తి, బొమ్మకంటి సుబ్బారావు, విద్వాన్ విశ్వం, శ్రీనివాస చక్రవర్తి మున్నగువారితో ఆ పత్రికలో పనిచేశారు. భారతి, ఆంధ్రప్రభ (1947-59) ఆంధ్ర పత్రిక (1960-71), ఆంధ్రభూమి (1975-79) పత్రికల్లో వివిధ స్థాయిల్లో హోదాల్లో పనిచేశారు. తిమ్మావఝ్ఝల కోదండరామయ్యతో కలిసి 'పరిశోధన' అనే పత్రికను నడిపారు. ఇది మద్రాసు నుండి త్రైమాసిక పత్రికగా వచ్చింది. తిరుమలవారు పరిశోధక్, పరిశీలకి, తాతాచార్య, జిజ్ఞాసువు, ప్రయాణికుడు, ప్రేక్షకుడు లాంటి కలం పేర్లతో అనేక మంచి వ్యాసాలు రాశారు.

తిరుమలవారికి తెలుగుదేశంలో ఎనలేని కీర్తిని ఆర్జించిపెట్టిన గ్రంథాలు 'మన లిపి పుట్టుపూర్వోత్తరాలు' 'నుడి- నానుడి', 'గాథాసప్తశతి'లో తెలుగు పదాలు, 'సాహితీ సుగతుని స్వగతం' 'తెలుగు పత్రికల సాహిత్య సేవ', 'మన లిపి పుట్టుపూర్వోత్తరాలు రచన చాలా బాగా గొప్పది. లిపి పరిణామాన్ని గూర్చి ఇందులో వివరించారు. ఇతర భాషల్లో ఇలాంటి రచనలేదని తాపీధర్మారావుగారు, రామచంద్రగారిని అభినందించారు. అందరికీ అర్థమయ్యే రీతిలో వీరు ఈ గ్రంథం రాశారు. రెండు వేల సంవత్సరాల్లో లిపి పరిణామక్రమాన్ని చాలా విపులంగా రాసిన ఈ గ్రంథం 1950లో ప్రచురితమైంది.

'నుడి - నానుడి' (1963) అనే గ్రంథం శబ్ద వ్యుత్పత్తికి సంబంధించింది. ఇందులో తిరుమలవారు నుడికారాల పుట్టుపూర్వోత్తరాల్ని సామెతల్ని ఇలా ఎన్నో అంశాల్ని నిశితంగా పరిశీలించారు.

తిరుమల రామచంద్రగారితో గల సన్నిహిత సంబంధం ఎన్నటికీ మరచిపోను

ఆయన నవ్వులు విరాజిల్లు ద్విభాషా సంపన్నుడు. భేషజం యెరుగనివాడు. చిన్నవారితో స్నేహితమూ సన్నిహితముగా మసిలే స్వభావం కలవాడు. హెచ్చుతగ్గుల వేర్పాటు తనానికి చోటివ్వనివాడు. అనర్గళంగా మాట్లాడే భాషా సంపన్నత ఉన్నా మితంగా మాట్లాడడం, మృదువుగా మాట్లాడడం ఆయనకే చెల్లింది.

ఆంధ్రపత్రికలో నేను పనిచేస్తున్నప్పుడు, నాది చిన్న ఉద్యోగమని భావించ కుండా నా టేబిల్ దగ్గరకి వచ్చి మాట్లాడేవారు. అలాగే అందరి వద్దకూ వెళ్ళి కుశలములడిగే వారు. ఆయన ఆంధ్రపత్రికలో పనిచేస్తున్నప్పటికినీ, ఆయనకు 'భారతి' సాహితీ మాసపత్రిక బాధ్యతలను శంభూప్రసాద్‌గారు అప్పగించారు. పెద్ద పెద్ద గ్రంథాలూ, వ్యాకరణ గ్రంథాలూ వచ్చినపుడు ఆయనకే సమీక్షలు వ్రాసే అధికారం యిచ్చేవారు.

ఆ రోజుల్లో ఆయన ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, మీజాన్ పత్రికల్లో కూడా పనిచేశారు.

చల్లని వెన్నెలలో...

చల్లని వెన్నెలలో – చక్కని కన్నె సమీపములో
అందమె నాలో లీనమాయెనే... ఆనందమె నా గానమాయెనే
తెలి మబ్బుల కౌగిలిలో జాబిలి... తేలియాడెనే ముద్దులలో
గాలి పెదవులే మెల్లగా సోకిన ... కనిపించును ఆ తారలలో
ఓ...ఓ...ఓ...
కలకాలం నీ కమ్మని రూపము... కలవరింపు నా మదిలో...

మాధుర్యం చిలికే ఈ రసగుళిక 60 ఏళ్ల క్రితం విడుదలైన 'సంతానం' (5.8.1955) చిత్రంలోని అక్కినేని వెన్నెలతో పాట మందమారుతాన్ని ఆస్వాదిస్తూ డాబా మీద పియానో వాయిస్తూ పాడుతుంటే, సావిత్రి తన్మయత్వంతో నృత్యం చేసే అద్భుతమైన సన్నివేశం.

వెన్నెల, చందమామ, ఆకాశం, తారలు, మలయానిలయం, మల్లెల పరిమళం... వంటి పదాలు లేకుండా ప్రణయగీతాలు ఎలా ఉంటాయి? ఇదీ అలాంటిదే. అనిశెట్టి రాసిన ఈ గీతానికి సుసర్ల దక్షిణామూర్తి సంగీతం సమకూర్చారు. ప్రేయసీ వదనం తారల్లో కనిపించడం, తెలిమబ్బుల కౌగిలిలో జాబిలి తేలియాడడం, గాలి పెదవులు సోకగానే పూలు నిద్దురలో నవ్వడం... ఎంత రమణీయ భావనలో కదా!

ఈ పాట ఒక చక్కని రాగాలాపనతో మొదలవుతుంది. ఇది ఘంటసాల పేటంటైన కళ్యాణి రాగం. ఆలాపన ఎంతో సంక్లిష్టంగా సాగుతుంది. దీన్ని వింటే సుసర్ల, ఘంటసాల ప్రజ్ఞకు పరీక్ష పెట్టారా అనిపిస్తుంది. సినీ సంగీత ప్రపంచంలో సుసర్లది ఒక ప్రత్యేక అధ్యాయం. ఈయనకున్న శాస్త్రీయ పరిజ్ఞానం అలవికానిదైనా 'ఇమిటేషన్ మ్యూజిక్' చేస్తాడనే అపఖ్యాతి కూడా ఉంది. 1950లో వచ్చిన 'సంసారం' పాటల్లో కొన్ని హిందీ బాణీలు కావడం అందుకు ఒక కారణం కావచ్చు.

ఏదేమైనా ఒక సమిష్టి కృషితో చేసిన అద్భుతగాన ప్రక్రియగా ఈ పాట నేటికీ నిలిచిపోయి, తెలుగువారి గుండెల్లో తేనెలు చిలుకుతూనే ఉంది. మరో విశేషం ఏమంటే లతా మంగేష్కర్ తొలిసారి తెలుగుపాటను (నిదురపోరా తమ్ముడా) పాడింది ఈ సినిమా కోసమే.

– డాక్టర్ కంపల్లె రవిచంద్రన్

'సంతానం' చిత్రం విడుదలయిన తరువాత అనిసెట్టి సుబ్బారావు పాటలకు మంచిపేరు వచ్చింది. అనిసెట్టి, పినిశెట్టి రచయితల కాంబినేషన్‌లో వచ్చిన చాలా చిత్రాలు సూపర్ హిట్టు లయ్యాయ్.

కొన్ని చిత్రాలు తమిళ, హిందీ భాషల్లో నిర్మించబడ్డాయ్. అనిసెట్టి సుబ్బారావు, పినిశెట్టి శ్రీరామమూర్తిలిరువురూ విడివిడిగా చిత్రాలకు దర్శకత్వం వహించారు.

న్యాపతి రాఘవరావుగారు అనిసెట్టి పినిశెట్టి అని విడివిడిగా అనడం ఎందుకు 'అనిపినిశెట్టి' అందామనేవారు!

ఈ ఇరువురూ గోటేటికి మంచి హితులు, స్నేహితులైనందున ముగ్గురి రచనల ప్రచురణ కొరకొక ప్రచురణా సంస్థను నెలకొల్పాలని అనుకున్నారు గానీ, క్రియారూపం దాల్చలేదు.

అనిసెట్టి, పినిశెట్టి కలిసి సాధనావారి 'సంతానం' చిత్రంలో 'నిదురపోరా తమ్ముడా నిదురలోనే గతమునంతా నిముసమైనా మరచిపోరా' అని వ్రాసిన పాట సూపర్‌హిట్టయ్యింది. ఈ పాటను సుప్రసిద్ధ హిందీ గాయని లతా మంగేష్కర్ పాడి సూపర్‌హిట్ చేసారు. అటు తరువాత లతా మంగేష్కర్ కొన్ని తెలుగు చిత్రాల్లో పాటలు పాడి తెలుగు ప్రేక్షకులకు సన్నిహితులయ్యారు. అలా తెలుగు చిత్రాల్లో హిందీ నేపథ్యగాయకులూ, హిందీ చిత్రాల్లో తెలుగు నేపథ్యగాయకులూ ప్రాచుర్యం పొందారు.

'గాథాసప్తశతి'లో తెలుగు పదాలు గ్రంథం 1978లో వచ్చింది. తిరుమల వారికి సంస్కృత, ప్రాకృత భాషలో మంచి ప్రావీణ్యముందని చెప్పడానికి ఈ గ్రంథం నిదర్శనం. ఇందులో 150 మూలగాథల్ని ప్రాకృతంలోనివి ఇచ్చి, వాటి అర్థ తాత్పర్యాలు కూర్చారు. 1986లో ఈ గ్రంథం రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందింది. 'గాథాసప్తశతి'లో ఏయే సందర్భాల్లో ఏయే అర్థాల్లో తెలుగు పదాలు కనబడతాయో వివరించారు.

'సాహితీ సుగతుని స్వగతం' (1969)లోని వ్యాసాలు 'భారతి' మాస పత్రికల్లో వచ్చాయి. ఈ వ్యాసాలు తిరుమల వారి పరిశోధనగా ప్రతిభకు నిదర్శనాలు. ప్రాచీన ఆధునిక సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలపై విశ్లేషణాత్మక వివరణ ఇందులో వుంది. 1971లో ఈ గ్రంథానికి రాష్ట్ర సాహిత్య అకాడమీ ఉత్తమసాహిత్య విమర్శ బహుమతి లభించింది. 'తెలుగుపత్రికల సాహిత్యసేవ' గ్రంథంలో పత్రికల ఆవిర్భావ వికాసాన్ని గూర్చి అద్భుతంగా రాశారు. పత్రికా రంగానికి సంబంధించి ఈ గ్రంథం చాలా ప్రామాణిక మైంది. తిరుమల రామచంద్ర 'మూడు వాఙ్మయ శిఖరాలు' (1987) అనే గ్రంథం చాలా విలువైంది. భాషా, సాహిత్య విమర్శన రంగాల్లో విశేష కృషి చేసిన ముగ్గురు మహనీయులు మానవల్లి రామకృష్ణ కవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, నిడదవోలు వేంకటరావు.

'అవధాన కల్పలత' క్షేమేంద్రుడి రచనకు అనువాదం. గౌతమబుద్ధుని పూర్వజన్మలకు సంబంధించిన జాతక కథలిని మహాయాన బౌద్ధులు తథాగతుడి దివ్య చరిత్రను గూర్చి రాసిన గ్రంథం 'లలిత విస్తరం' బులుసు వేంకటరమణయ్య గారితో కలిసి ఈ గ్రంథాన్ని తిరుమలవారు రాశారు. ఇది 1972లో వెలువడింది. హాలుడి గాథా సప్తశతి నుంచి ఏభై కథల్ని తీసుకొని 'హాలుని గాథలు'గా రాశారు. 'మనవి మాటలు' 'అహంభో అభివాదయే' 'బృహదారణ్యం' అనే సంపుటాలు వెలువడ్డాయి.

వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతులు గడించిన మహనీయుల జీవిత రేఖల్ని 'మరపురాని మనీషి' శీర్షికతో 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రికలో వ్యాసాలు రాశారు. విభిన్న రంగాలకు చెందిన సుప్రసిద్ధ వ్యక్తుల్ని పరిచయం చేయడంలో కొత్త ఒరవడిని ప్రవేశపెట్టారు.

'హంపీ నుంచి హరప్పాదాకా' అనే రామచంద్రగారి 'స్వీయచరిత్ర'. ఇందులో ఆయన ముప్పై సంవత్సరాల వయస్సు వరకు సంభవించిన జీవిత విశేషాలు చోటుచేసుకున్నాయి. స్వీయజీవితోదంతాల్లో మూడో వంతు మాత్రమే చెప్పగలిగానని తిరుమలవారే చెప్పారు. రామచంద్రగారి చివరి గ్రంథం ఇది. ఇది రామచంద్ర భాషా సాహిత్య సేవల్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ ఇచ్చి ఘనంగా సన్మానించారు. 1997 అక్టోబర్ 12న తన 84వ ఏట కీర్తిశేషులయ్యారు. ●

శివాంశుడు శివాజీ

ఛత్రపతి మహరాజ్ వంటి ప్రముఖ నామధేయాలతో స్వాతంత్ర్య సమర యోధుడు శివాజీ భారతీయులకు సుపరిచితుడు. అప్పటి మహారాష్ట్ర జాగీర్దారు అయిన షాహజిభాన్‌స్లే–జిజాబాయి దంపతులకు 10-01-1627లో, షవన్నీరు కోటలో జన్మించాడు మన నాయకుడైన శివాజీ. విద్యాగురువు ఖాండదేవ్/మత గురువు సమర్ధ రామదాసు/జన్మ గురువు అయిన జిజాబాయిల నేతృత్వంలో శివాజీ వీరునిగా – శూరునిగా, ముస్లింల గుండెల్లో నిద్రించే సింహంలా మలిచాయి.

మహరాష్ట్రలో 'మావలీలు' అనే తెగకు చెందిన యువకులను శివాజీ చేరదీసి, తన 19వ యేటనే 'ఇరుగు..పొరుగున వున్న రాజ్యాలను ఆక్రమించి, పూనా పరిసర ప్రాంతంలో తన తండ్రి కోల్పోయిన జాగీర్లను కైవసం చేసుకొని, బీజాపూర్‌పై దండెత్తాడు. బీజాపూర్ సుల్తాన్ శివాజీని బంధించి తీసుకొని రమ్మని పంపిన అఫ్జల్‌ఖాన్ మహావీరుడైన శివాజీ చేతిలో హతుడైనందున, సుల్తాన్ విధిలేక శివాజీకు 'రాజా' అన్న బిరుదును ప్రదానం చేసి అతడితో సంధి చేసుకున్నాడు.

బీజాపూర్ సంధిలో మరింత ఉత్సాహం పొందిన శివాజీ భవానీమాత ప్రసాదించిన ఖడ్గంతో మొగల్ పాలనలోని దక్షిణ దక్కన్ ప్రాంతాలపై దాడి చేశాడు. దీని పర్యావసానంగా ఈ వీరుడు తన ఆఖరి నిముషం వరకూ ఔరంగజేబుపై పోరాటం సల్పవల్సి వచ్చింది. ఔరంగజేబు పంపిన 'షయిస్తఖాన్'ను శివాజీ సంహరించడంతో! ఆ మొగల్ చక్రవర్తి 1665లో పురందరు సంధి పేరిట శివాజీతో స్నేహం నటించి, తన దర్బారుకు ఆహ్వానించి అవమానించి బంధింప ప్రయత్నం చేశాడు, కానీ మన నాయకుడు అతడి ప్రయత్నాలన్నింటినీ విఫలం చేసి, మరింత పగ, ప్రతీకారంతో అతడి ఆధీనంలో వున్న దక్షిణ ప్రాంతపు కోటలన్నింటినీ ఆక్రమించాడు.

శివాజీ పాలనలోని ప్రత్యేకత

నేటి మన రాజకీయాల్లో వున్న ట్లుగా 30/40 మంది మంత్రులు శివాజీ పాలనలో వుండేవారు కాదు. అష్టప్రధానులు అనే పేరిట కేవలం 8 ముఖ్యమైన శాఖలను 8మంది మంత్రులు మాత్రమే సమర్ధవంతంగా నిర్వహించేవారు. మన పాలకులు పరిశ్రమలు నేటి రియల్ ఎస్టేట్ రంగాలకు ప్రాముఖ్యం ఇచ్చినట్లుగా శివాజీ ఆనాడు చేయలేదు. పూర్తిగా వ్యవసాయాన్ని మాత్రమే వృద్ధి చేశాడు.

శివాజీ మంత్రి మండలిలో ఉప ప్రధాని– 'పీష్వా' అనీ..., రెవెన్యూ శాఖా మంత్రిని 'మజుమ్‌దార్' అనీ..., ఆర్ధిక మంత్రిని... 'ఫధ్న వీస్' అనీ..., స్థానిక స్వపరిపాలనా శాఖా మంత్రిని 'వాక్నవీస్...అనీ.., రక్షణమంత్రిని... 'సర్ నౌబత్' అనీ..., విదేశాంగమంత్రిని... 'డబీర్' అనీ..., న్యాయశాఖా మంత్రిని... న్యాయాధీశ్ అనీ..., మతశాఖా మంత్రిని... 'పండిత'...అనీ వ్యవహరించేవారు.

శివాజీ పాలనా విధానం మొగల్+హిందూ పద్ధతుల మేళవింపులో సాగింది. మంత్రులకు జాగీర్లకు బదులు జీతాలు ఇచ్చే పద్ధతిని శివాజీయే ప్రారంభించాడు. పంటల్లో 2/3 వంతు శిస్తును వసూలు చేసేవారు. ఈ శిస్తు ధన/ధాన్య రూపంలో వుండేది. శివాజీ సిక్కులను చేరదీయడం వల్ల హిందువులకు గట్టి రక్షణ లభించినట్లైంది. (నేటికిని మనదేశపు రక్షణ వ్యవస్థలోని కీలక పదవుల్లో సిక్కులే వుండటం గమనించదగినది.)

శివాజీ ఆదాయం సంవత్సరానికి 7 కోట్ల రూపాయలుగా చరిత్రలో లిఖించబడివుంది. పన్నులను గుత్తకు ఇచ్చే పద్ధతిని శివాజీ రద్దు చేసి, భూమిని కొలిచి పన్ను వసూలు చేసే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టినాడు. ఈ పనిచేసే అధికారిని 'అణ్ణాజీ' అనేవారు. సాలీనా టోకు పంటలపై మొత్తం 33శాతం మాత్రమే పన్ను విధించి – వసూలు చేసేవారు.

చంద్రహాస్?

ఇది ఒక సినిమా పేరు అయితే కావచ్చును కానీ దేశ భక్తుడైన శ్రీ శివాజీ మహరాజ్‌కి గురువైన సమర్ధరామదాసు చేసిన మంత్రోపదేశ-ఉపాసనల కారణంగా స్వయంగా ఆ భవానీ మాతయే ప్రసాదించిన అత్యుత్తమమైన ఖడ్గరాజం ఈ 'చంద్రహాసం'.

- ☛ దేవతా ప్రసాదితం కావడం వల్ల, ఏక కాలంలో 7గురు యోధులను ఏకరీతిగా నరకగల శక్తి ఈ చంద్రహాసం ప్రత్యేకత.
- ☛ 360 డిగ్రీల్లో యే కోణంలో 'ఝుళి'పించినా గురి తప్పకపోవడం రెండో ప్రత్యేకత.
- ☛ దీనిని తెలియని వారు కూడా అతి నేర్పరుల వలె ఉపయోగించవచ్చు. 7.1/2 కిలోల బరువు కల ఈ అపూర్వమైన ఖడ్గం దాడి చేసిన శత్రువు దేహంలోని కండరస్నాయువులను మాత్రమే ఖండించి అతడ్ని నిస్సహాయ స్థితిలోకి నెడుతుంది.

శివాజీ మరణానంతరం

మహరాష్ట్రులు-శిక్కుల యుద్ధ కౌశలానికి, దేశభక్తిని-మత భక్తిని జోడించి వార్ని మహయోధు లుగా చరిత్రలో నిలిపిన వ్యక్తిగా ఛత్రపతి శివాజీ కీర్తించబడి నాడు. అయితే ఇక్కడ తమాషా ఏమంటే! ఇంతటి దేశభక్తుని కడుపున పుట్టిన ఆయన ప్రథమ భార్య కుమారుడైన శంభూజీ తండ్రి మరణానంతరం మొగలు వారితో చేతులు కలిపి, 1689లో వారిచేతనే క్రూరంగా చంపబడటం. ఇతని మరణానంతరం శివాజీ రెండో భార్య కుమారుడైన రాజారామ్ సింహాసనాన్ని అధిష్టించడం- మహరాష్ట్రీయులకు ఇష్టం లేకపోయింది. ఈ కారణంగా వారిలో చీలికలు పొడసూపాయి. ఆ సమయంలో శివాజీ మనుమడైన 'సాహు' రంగం లోకి దిగి తిరిగి మహరాష్ట్రీయులను ఏకం చేశాడు. 1760 వరకూ వారు భారతావనిని అవిచ్ఛన్నంగా ఏలినారు.

శివాజీ తన రక్షణ కోరిన వారినుంచీ, వారి భూముల పైనా 4వ వంతు ధనాన్ని వసూలు చేసేవాడు. దీనిని 'చౌత్' పన్ను అని పిల్చేవారు. ఈ పన్నుల వల్ల శివాజీ ఖజానా 365 రోజులూ నిండుగా వుండి, అతడి సామ్రాజ్య విస్తరణా-అభివృద్ధి పనులకు సాయంగా నిల్చింది. జిల్లాలను సుబేదార్లు, పటేళ్ళు, తాలుక్దార్లు అనే మూడు రకాల ప్రత్యేక అధికారులు పాలించే విధానాన్ని శివాజీయే మొట్ట మొదటిగా ప్రవేశపెట్టాడు.

1674లో జూన్-6వ తేదీన ఛత్రపతి బిరుదుతో శివాజీ పట్టాభిషిక్తుడైనాడు.

విజయనగర పతనానంతరం హిందూ సంస్కృతీ-మత సాంప్రదాయాలను పునరుద్ధరించిన మహాయోధుడిగా శివాజీ స్థానం చరిత్రలో చిరస్మరణీయంగా మిగిలిపోయింది. శివాజీ గురువైన శ్రీసమర్థరామదాసు ఆయన్ని సాక్షాత్ శివాంశ సంభూతునిగా వర్ణించారంటే! శివాజీ యొక్క ప్రత్యేకత ఏమిటో మనకి బోధపడుతుంది. 1680లో శివాజీ ఔరంగజేబుపై పెద్దఎత్తున దాడి చేయడానికి సన్నాహాలు చేస్తూ 3-4-1680న అకాల మృత్యువు వాతపడి భారతావనిలోని హిందువులందర్నీ దుఃఖసాగరంలో ముంచివేశారు.

శివాజీ మరణాన్ని ఆసరాగా తీసుకొన్న ఔరంగజేబు కాశీలోని విశ్వేశ్వరాలయాన్ని కూలగొట్టి మసీదు కట్టించాడు. (బాబరు అయోధ్యలోని రామాలయాన్ని కూలగొట్టి మసీదు నిర్మించాడు) 1788లో ఇండోర్ మహరాణి అహల్యాదేవి నడుంబిగించి తిరిగి విశ్వేశ్వరాలయాన్ని మసీదు ప్రాంగణంలోనే నిర్మించి వీరవనితగా ఖ్యాతి కెక్కేంత వరకూ...అంటే సుమారు 108 సంవత్సరాలపాటు కాశీలో విశ్వేశ్వరాలయం లేక బోసిగా వుండిపోయింది.

శివాజీ వ్యక్తిత్వం :

పరమత సహనం-హిందూమత, ధర్మరక్షణ వంటి పలు విషయాల్లో శివాజీ ఎంతో ఉన్నతుడై, ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. దేశభక్తియే కాదు,

ఎవరి మతం పట్ల వారికి గౌరవం అభిమానమే కాక దానిని రక్షించుకునే బల ధైర్య సాహసాలు వుండాలని శివాజీ హిందువులకు బోధించాడు. తుకారాం! సమర్థ రామదాసు వంటి మత గురువులను చేరదీసి పోషించాడు. హిందూమతానికి ఏ సమయంలో ఆపద వాటిల్లినా! తాను ముందుండి మహరాష్ట్రీయులను, సిక్కులను ముందుకు దూకించాడు. ఇంతటి మహాగొప్ప వ్యక్తిత్వం కలవాడు కనుకనే శ్రీ గడియారం వేంకటశేష శాస్త్రిగారు శివాజీ కథను 'శివభారతం' అనే పేరిట ఒక ఆధునిక కావ్యాన్ని వ్రాశారు. ఇదిలా వుంటే పశ్చిమ బెంగాల్ మార్క్సిస్టు పార్టీ వారు ప్రవేశపెట్టిన పాఠ్యపుస్తకాల్లో శివాజీని రాజ్యకాంక్ష కల వ్యక్తిగానూ! ఔరంగజేబును ఒక గొప్ప మతసన్యాసిగానూ అభివర్ణించడం సిగ్గుచేటు చర్యగా వుంది. ఎవరి సంస్కారం వారిది మరి! ●

నాన్నంటే నీ మూలధాతుడు!

కొంతమందికి నాన్నపై కొండంత పేరు ఉండదు. అరుణ్‌సాగర్ 'కవిత' ఆగస్టు సంచికలో నాన్న గురించి పొందుపరిచిన చిరుకవితను పొందు పరుస్తున్నాను.

'అమ్మ గురించి పాటలెన్నో ఉన్నాయ్!
కానీ, నాన్నను పాడిన వారెవరు?
నిజమన్నా 'నాన్నంటే అన్‌సంగ్ హీరో
నాన్నంటే ఒక ఒంటరి పర్వతం
నాన్నంటే నీ మూల ధాతువు
దేహము, విజ్ఞానము బ్రహ్మోపదేశమూ!

(ఓ కవితా ఆగస్టు 2017 సంచికలో అరుణ్‌సాగర్‌కు కృతజ్ఞతలతో వారి కవిత)

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

044 25204046, 26171341

‘కలి’ అవతారం దాల్చవలసిన సమయమేతెంచినదా?

ధర్మ సంస్థాపనా ర్థాయ సంభవామి యుగే యుగే - అన్నది గీతాచార్య కృష్ణ పర మాత్ముని సిద్ధాంతం. నిజాని కిపుడు ‘కల్కి అవతారం దాల్చవలసిన సమయమే తెంచినదేమో! జయదేవ మహాకవి వాక్రుచ్చినట్లు-

“మ్లేచ్ఛనివహనిధనే కలయసి కరవాలమ్
దూమకేతు మివకియపి కరాలమ్
కేశవధృతి కల్కి శరీర జయజగదీశ హరే-

ఈ ప్రస్తుత యుగంలో పలుమంది పాలకులు వంచకులుగ మారారు. ధర్మగ్లాని జరుగుతూంది. అన్యాయం, అక్రమం, అనైకృత, అశ్లీల గుణములు నానాటికీ విజృంభిస్తున్నాయ్. నోరున్నవానిదే రాజ్యంగా ఉంది. సనాతన ధర్మ ప్రాతిపదికగా నెలకొనబడిన హిందూత్వంపై తిరుగుబాటు ప్రారంభమైంది. మ్లేచ్ఛవర్గం పెరుగుతూంది. దేశభక్తి నశిస్తూంది. కొన్ని వర్ణాలను, వర్గాలనూ అణగద్రొక్కే ప్రయత్నం బలమవు తూంది. దైవదూషణం జరుగుతూంది. వారిని అణచేందుకు శ్రీకల్కి భగవానుడు ఉదయించవలసిన తరుణమేర్పడింది.

పాలకులు సత్యధర్మదయా హీనులై, మదాంధులై క్రోధ మద కుటిల మాత్సర్యాలతో రజస్తమోగుణ రహితులై, తమలో తాము కలహిస్తూ, ప్రజా హింసకు తలపడ్తున్నప్పుడు, ధర్మం దారితప్పుతుంది. అంటే దర్మగ్లానియవుతుంది. అప్పుడు దేవుడు అవతారమెత్తవలసిన పరిస్థితి తలయెత్తుతుంది. ఇపుడాయన ఎత్తవలసిన అవతారం కల్కి అవతారం.

శ్రీకృష్ణుడు ఉన్నంత వరకూ, ఏ అవతారమూ అవసరం లేకపోయింది. ఆయనే పలుమంది దుష్ట పాలకులను వధించాడు. సాగరంలో కలిసే నదుల వలె ఆయన పలు అవతారములెత్తి యున్నాడు. పలు అనడానికి కారణం దశావతారములు పదే-శ్రీ భాగవతం ప్రకారం ఇరవై ఒక్క అవతారములు. పురాణ పరంగా పలు అంశ లతో ఉద్భవించాడాయన. ఇపుడు ఆవధనవతరించ వలసినది కల్కి అవతారమే! ఆయన శంబల గ్రామంలో విష్ణుయశునకు ‘కల్కి’గా జన్మిస్తాడని పురాణాంతర్గ విషయం.

అధాసౌ యుగ సంధ్యాయాం
దస్యుప్రాయేషు రాజసు
జనితా విష్ణు యశసో నామ్నా
కల్కిః జగద్గురుః

-అన్నారు. దుష్టులను దునుమాడి, శిష్ట రక్షణ కావించడానికి నారాయణుడు శంబల గ్రామమున విష్ణు యశుడను మునికి కల్కి అవతారుడై జన్మిస్తాడట. శ్వేత అశ్వారూఢుడై, ఖడ్గధారియై దుష్టమ్లేచ్ఛులందర్నీ వధిస్తాడనీ, వసుధ మ్లేచ్ఛ రహితంగా వర్ధిల్లుతుందనీ, జనులు ప్రవర్ధిల్లుతున్నారనీ వింటున్నాం, ఆ రోజుల కోసం ఎదురు చూద్దాం. ●

Beautiful City - Beautiful Hotel
DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది

అంబికా దర్బార్‌బత్తి

జాత్యంహకారం వీడండి! జన సమైక్యతకు బాటలు వేయండి!

ఆది అంతములు లేనిది, అమేయమైనది, అద్వితీయ ప్రతిభా సమన్వితమైనది, సర్వశక్తికరమైనది, శుద్ధమైనది, సుసంపన్న మైనదీ, సత్య, శాన్త, సుమంగళకరమైనదీ జ్ఞానం. ఆ జ్ఞానాన్ని అహంకార రహితంగా, అందరూ అధ్యయనం చేసి, అహంకార మును బాపుకుని, బ్రహ్మజ్ఞానం పొందేవారు. బ్రహ్మజ్ఞానులుగ విలసిల్లేవారు. అప్పుడు జ్ఞానమమకారం తప్ప, జాత్యహంకారం ఉండేది కాదు.

ఇది భారతదేశ పూర్వపు సనాతన ధర్మచరిత. చర్మమునకూ, మాంసమునకూ, ఎముకలకూ, రక్తమునకూ జాతీయనెడిది ఉండెడిదికాదు. అవిద్య, విద్య, అజ్ఞానం, విజ్ఞానం అనెడు లోపాలోపములన్నిటినీ, వర్ణాశ్రమ ధర్మముగ పరిష్కరించి, ఒకరికొకరు మంగళ, అమంగళకర విషయములందు తోడయ్యేట్టుండగలరని ఊహించారు.

భవిష్యత్తులో సంభవించే యాంత్రిక జీవనంలో ఒకరి కొకరికి పొసగకుండా, హృదయం విప్పి మాట్లాడుకోకుండా ఉండే ప్రమాదం రాగలదని పూర్వులు ముందే ఊహించినట్టు తోస్తున్నది.

యాంత్రిక యుగంలో మనిషికి ప్రశాంతత కరువవు తుందనీ, జాత్యహం కారం, కులద్వేషమై (కులమనే క్రొత్త పేరు వర్ణధర్మానికి కలిగి) కులాల మధ్య అగాధమూ పెరిగిపోతుందనీ, ఆధ్యాత్మిక చింతన, హృదయంలో పరమాత్మకు స్థానమనేది ఉండదనీ, దైవమనిననూ, ధర్మమనిననూ ద్వేషం పెరుగుతుందనీ వారానాడే భావించి, వర్ణాశ్రమ ధర్మానికీ, గ్రామపాలనకూ అవకాశం కల్పించారు.

కులం, మతం, ప్రాంతం అనే పదాలకు తావు లేకుండా, సర్వహితైషకరమగు, సర్వభూతదయను ప్రవేశపెట్టారు. గడ్డి పరకనుంచీ బ్రహ్మము వరకూ సర్వమూ నందూ సర్వేశ్వరుడున్నాడనే తత్వాన్ని బోధించారు. పిపీలికాది బ్రహ్మ పర్యం తమూ అన్న నానుడి ఈ కారణంగానే పుట్టింది. అగ్ర అధమ జాతులనెడివి సృష్టిలో లేవు. సుర అసురులు మాత్రమే ఉండే వారనీ అధర్మగుణపరులైన అసురులు ఎంతటివారైనా అంతరిస్తారనెడి విషయాన్ని చారిత్రక ప్రమాణికపరంగా రూఢి చేశారు. అధర్మాసుర బుద్ధితో, ధర్మ ద్వేషంతో వేదాలను, భూమినీ చుట్టుచుట్టి సముద్రంలో కలిపిన అసురులను పరమాత్మ అసురసంహారం కావించి వెలికితీసిన నిజం విదితమే!

కానీ ఇప్పుడు కొందరు పెద్ద సైజు పదవిగల ప్రజా నాయకులు ధర్మశాస్త్రాలనూ, అగ్రజాతులనూ (అగ్రజాతులంటే నాకేంవిటో అర్థం కాలేదు) సముద్రంలో త్రొక్కి పడేయ్యాలంటున్నారు. ఈ సందర్భంగా నాకు అల్పబుద్ధివానికధికారమిచ్చినా దొడ్డవారినెల్ల తొలగగొట్టునన్న వేమన పద్యం స్ఫురించింది.

పూర్వపు పెద్దలు అందరినీ సమపథంలోనే నడపాలనీ, సన్మార్గపరులుగూ, బ్రహ్మజ్ఞానధనులుగా విలసిల్లింపచేయాలని, వేదబ్రహ్మ జ్ఞానాన్ని, విశ్వవిస్తరణం చేశారు. అందరినీ బ్రహ్మజ్ఞాన పరులైన బ్రాహ్మణులుగానే తీర్చిదిద్దారు. సర్వ ప్రాణుల్లోనూ సర్వేశ్వరుడైన పరమాత్ముడున్నాడన్నారు. ఈశ్వర స్సర్వభూతానాం అంటూ అందర్నీ జ్ఞానమెరిగిన జ్ఞాన స్వరూపిల్ని కావించారు.

ప్రాణం వాపి పరిత్యజ్య మానమే వాభి రక్షతు
అనిత్యో భవతి ప్రాణో మానమా చంద్ర

– ఆత్మాభిమానం కలది ప్రాణియనీ, జీవ సంరక్షణమే ఆత్మధనమనీ, దానిని విడనాడి ఏ జీవమూ మనలేదనీ, సకల చరాచరజీవులూ బుద్ధజీవులేనంటూ నర, వానర, చర, అచర, విహంగ, పద, ద్విపద, చతుర్పాద జీవులన్నిటి అవసరం మనిషి కున్నదంటూ రామాయణ రస కావ్యం ద్వారా తెలియచేసినవాడు, బోయవాడైన వాల్మీకి వరేణ్యుడు. ఆయన సకల చరాచరానికీ, ఒకరితో నొకరికి సంబంధం ఉందంటూ రామకథలో అనేక జీవుల్ని తీసుకున్నాడు. పరస్పరమైత్రీ సహకారాలతో బాటు, విశ్వ కుటుంబ వ్యవస్థకు గల అవసరాన్నీ, కుటుంబంలోని వివిధ ప్రాంతాల మధ్య బంధు బంధన గౌరవాన్ని తెలియచేశాడు. బుద్ధ జీవిగాని జ్ఞాని, శక్తిమంతుడైననూ, ధర్మబద్ధుడు కాడనీ ఎలాటి దురవస్థల పాలవుతాడన్నది రావణ, వాలి పాత్రల ద్వారా ధృవీకరించాడు. భరత, లక్ష్మణ, శతృఘ్న పాత్రల ద్వారా భాతృ వాత్సల్యాన్నీ, రామ పాత్ర ద్వారా పితృ, మాతృ, భాతృ, గురు, హిత, స్నేహిత, భక్తుల పట్ల వాత్సల్యానురాగతనూ వివరిస్తూ, రామరాజ్య పాలన ఔన్నత్యమేం విటో విశ్లేషించాడాయన.

జన్మతః ముస్లిము అయినప్పటికినీ రామభక్తి పరుడైన కబీర్ మహనీయుడు. 'హంసాపాయే మానస సరోవరే తాల్ తలయ్యా, క్యోందోలే' అంటాడు.

హంసకు మానసరోవరం లభించిననాడు మురికి గుంటలు వెంటబడుతుందా – అంటాడు. అందలి అర్థం గ్రహించి, ఆర్ష ధర్మాన్ని గ్రహింపకల్గిననాడు, ఇన్ని అనర్థాల పాలయ్యే వారము కాము. ఇంతటి అసురత్వం దేశంలో విజృంభించి విలయతాండవం చేసేది కాదు.

రాముడు అగ్రజాతివాణ్ణి అనుకుని ఉంటే, అడవుల్లోని శబరి ఇంటికేగి, దర్శనమిచ్చి, ఆమె రుచి చూచి యిచ్చిన ఎంగిలి పండ్లను భుజించేవాడు కాదు. నావను నడిపే గుహుణ్ణి స్నేహితునిగా భావించేవాడు కాదు.

అస్పృశ్యులని కొందరు వేరుచేసినవారిని, మహాత్మాగాంధీ, ప్రకాశం పంతులు గారు, పొట్టి శ్రీరాములు గారు, అనంత శయనం అయ్యంగార్ హరిజనులుగా అక్కున చేర్చుకున్నారు. కానీ ఈనాడెందుకో, మన కళ్లను మనమే పొడుచుకుంటూ, అగ్రజాతి వారంటూ ద్వేషాన్ని పెంచుకుంటున్నాం, విషజ్వాలలు, గ్రక్కుతున్నాం, విద్యార్జనలలోగానీ, ఉపాధిలో గానీ వారికి స్థానం లేకుండా చేస్తున్నాం.

కులము లేదంటూ కులవిభజన చేస్తున్నాం. ఇది గ్రహించే పూర్వం పెద్దలు కులమనిగానీ, మతమనిగానీ పేరులిడకుండా, వృత్తి ధర్మపరంగా ఉపాధులు కల్పించారు. ఆ వృత్తులు కూడా వృత్తంలోలా ఒకరికొకరు బలంగా రూపొందించారు. ఆ వృత్తి ధర్మగమ్యాలు చెడకుండా, రమ్యంగా, హార్ద్యంగా ఉండేట్టు ఆ వృత్తిలోని వారితోనే సంబంధబాంధవ్యాలను కల్పించే సాంప్రదాయాన్ని ఏర్పరచారు. శుభానికీ, అశుభానికీ అందరు వృత్తిపరులూ కలుసుకునేట్టు చేశారు. పోటీపడడమనేది కానీ, ద్వేషం పొడసూపడానికి గానీ సూదిరంధ్రమంతటి అవకాశాన్ని సహితము కలుగనీయలేదు. ఆ సిద్ధాంతము సాంప్రదాయంగా వర్ధిల్లినందువల్లనే రెండు వందల సంవత్సరాల పరాయి (విదేశీ) పాలనను సంఘటితంగా పోరాడి, స్వతంత్ర్యాన్ని సంపాదించకలిగాం. కొందరు తమ ప్రాణాన్ని దేశ స్వాతంత్ర్యం కోసం పణంగా పెట్టారు. కొందరు తమ సిరి సంపదల్నే త్యాగం చేశారు.

ఇప్పుడు కలిమాయ ప్రభావమో, రాజకీయ అంధత్వమో తెలియదు గానీ కులరాజకీయం, రిజర్వేషను వైషమ్యం, మత విద్వేషంతో దేశం అట్టుడికిపోతూంది. అసురత్వం, హింస, అసూయ, అవిజ్ఞానం ప్రబలిపోతున్నాయ్. మనదైన వేద శాస్త్ర, యోగ, సాంప్రదాయాన్ని పౌరాణిక సత్యాల్ని (కృష్ణుడున్నాడనీ, కురుక్షేత్ర సంగ్రామం జరిగిందని నాసా శాస్త్రవేత్తలు చెప్పారు) పశ్చిమ దేశస్థులు చెప్పగా నమ్ముతున్నాం. వారి ద్వేష, దోష, వేష, కావేష రాజకీయాల్ని గుత్తకు తెచ్చుకుంటు న్నాం.

దేశమనెడి దొడ్డ వృక్షం
ప్రేమయనెడి పూలెత్తవలెనోయ్!

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

సబ్‌కా మాలిక్ సాయి

ఈ భూమిమీద ఉన్నది ఒక్కటే మతం. అది మానవత్వం... అని చెబుతారు బాబా. ఆ సూక్తిని నరనరానా జీర్ణించుకున్నారు అహ్మదాబాద్‌కు చెందిన ఇక్బాల్‌షేక్. పన్నెండేళ్ళ క్రింతం ఆయన అహ్మదాబాద్‌లో సాయిబాబాకు గుడికట్టారు. ఇద్దరు పురోహితులు ఏర్పాటు చేశారు. అప్పట్నించీ నిర్విఘ్నంగా పూజలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో 1008 కిలోల సాయిబాబా విగ్రహం కొలువుదీరింది. పరాయిదేవుడు ఆలయం నువ్వెందుకు నిర్మించావు? అని కొందరూ, పరాయివాడివి మా దేవుడికి నువ్వెందుకు గుడికట్టావ్? అని ఇంకొందరూ.. ఇక్బాల్‌ను బెదరిస్తూనే వున్నారు. ఇక్బాల్ ఇద్దరి హెచ్చరికలూ పట్టించుకోలేదు.

స్వర్ణసాయి

సిక్కింలోని సాయిబాబా ఆలయం చూడటానికి పెద్ద కోటలా కనిపిస్తుంది. దీన్ని నాందీ అనే ప్రాంతంలో నిర్మించారు. రెండు అంతస్తుల్తో కట్టిన ఈ గుళ్ళో... పై అంతస్తులో సాయిప్రతిమ ఉంటుంది. మత్స్య, కూర్మ, వరాహ.. మొదలైన దశావతారాలనూ చిత్రించారు. మందిరం బంగారు వర్ణంలో మెరిసిపోతూ ఉంటుంది. దగ్గర్లోనే చైనా సరిహద్దు ఉండటంతో... ఆలయం చుట్టూ భద్రతా దళాలు పహరా కాస్తుంటాయి.

'మసాచూ సెట్స్' సాయి

అమెరికాలో స్థిరపడ్డ బాబా భక్తులంతలా కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారు. మసాచూ సెట్స్‌లోని గ్రోబాన్ ప్రాంతంలో అతి పెద్ద షిరిడీ సాయి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు 28 ఎకరాల మధ్యలో 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆలయాన్ని కట్టారు. చాలావరకూ పనులు పూర్తయ్యాయి. సాయి ఆలయానికి దగ్గర్లోనే నవగ్రహ మంటపమూ, రాధాకృష్ణులు, వినాయకుడు, శివుడు, దుర్గాదేవి, సీతా రామలక్ష్మణులు ... తదితర దేవతామూర్తుల ప్రతిమలున్నాయి. మొత్తం రెండంతస్థుల్లో నిర్మాణం జరుగుతోంది. భారతీయ పండుగలు, వివాహాది వేడుకలు జరుపుకోడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.



విరాట్ సాయి...

ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన సాయిబాబా విగ్రహం... విరాట్ సాయి. కాకినాడ దగ్గరున్న రేవూరులో ఉంది. నాలుగు దిక్కులకు దిక్కుగా, నాలుగు వేదాల సారంగా, నాలుగంతస్తుల భవనంపై సాయి కూర్చున్నట్లుగా 116 అడుగుల విగ్రహాన్ని నిర్మించారు. కాకినాడ – కోటిపల్లి రైల్వే లైన్ నుంచి చూస్తూ... రేవూరు సాయిబాబా కొబ్బరి చెట్లకన్నా ఎత్తుగా కనిపిస్తారు. ఆ విగ్రహం బరువు వేయిటన్నుల కన్నా ఎక్కువే. ఓ రూపం ఇవ్వడానికి మూడు కోట్లకు పైగా ఖర్చయిందంటారు. నిర్మాణానికి పుష్కరకాలం పట్టిందట.

ఆదిసాయి

సాయిబాబా పేరుచెప్పగానే గుర్తొచ్చే పుణ్యక్షేత్రం షిరిడీ. ఇక్కడి ఆలయం సుప్రసిద్ధం. అయితే సాయిబాబా మహాసమాధి (1918) అనంతరం నిర్మించిన తొలి ఆలయం మాత్రం... కుడల్ గ్రామంలో ఉంది. ఈ గ్రామం మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలోఉంది. 1922లో దీన్ని నిర్మించారు. బాబా దేహాన్ని వదలిపెట్టే ముందు తన అనుచరుల్లో ఒకరైన రామచంద్ర రాజీవ్ మాధవ్‌కి ఒక రూపాయి ఇచ్చాడట. ఆ రూపాయితో 1919లో బాబా సంవత్సరీకం చేశారట రామచంద్ర. అనంతరం తానే దగ్గరుండి 1922లో బాబా కోసం ఓ గుడి కట్టించారు. అందులో ఆరు అడుగుల సాయి విగ్రహాన్ని ప్రతిష్టించారు. మొదట్లో కుడల్‌లోని మందిర్ ఒక ఇంటిలా ఉండేది.

గురువైభవం

శ్రీ గురుభ్యోనమః

వైదిక మార్గమున గురువులు త్రివిధములు "చోదకో బోధకశ్చైవ మోచకశ్చ పర స్మృతః"

1) చోదక గురువులు – కర్మలు, ఉపాసనలను ఉపదేశము చేయువారు.
2) బోధక గురువులు – వైదికమార్గమున వేదాంత సిద్ధాంత బోధకులు, మహావాక్యాది సిద్ధాంతములను పరోక్షముగా బోధించి భావములను సిస్థిర పరచువారు
3) మోచక గురువులు – అద్వితీయమైన బ్రహ్మాత్మా పరోక్ష ప్రబోధముతో అవిద్య, దాని కార్యరూపములైన సంసారాది బంధములనుండి విమోచనము చేయు వారు.

ఇందులో చోదక బోధక గురువులు పరోక్ష జ్ఞాన సంపన్నులు కావచ్చు. అపరోక్ష జ్ఞాన సంపన్నులూ కావచ్చు. కానీ మోచక గురువు మాత్రమపరోక్ష జ్ఞానియే. అనగా పరోక్ష జ్ఞానులు చోదక బోధక గురువులగుదురేగాని, మోచక గురువులు కానేరరు.

ఒక ఐశ్వర్యవంతుణ్ణి ఆశ్రయించిన కొంత ధనము లభిస్తుంది. రాజాది అధికారులను ఆశ్రయిస్తే కొంత అధికారముతో కూడిన పదవి లభిస్తుంది. వేదాధ్యాపకుని ఆశ్రయిస్తే వేదము లభిస్తుంది. తర్కాది శాస్త్ర గురువులను ఆశ్రయిస్తే ఆయా శాస్త్రవిద్య లభిస్తుంది. శ్రౌత స్మార్తాది కర్మలనిర్వహించి గురువునాశ్రయిస్తే యాజ్ఞిక విద్యలు లభించడం ఎలా లోకంలో ప్రసిద్ధమో తత్తద్దేవతో పాసక గురువులను ఆశ్రయిస్తే ఆయా దేవతోపాస్తి లభించడం లోకవిదితమే. ఐతే ఈ పై గురువులలో బ్రహ్మానుభూతిపొందిన గురువులుండవచ్చు లేదా బ్రహ్మానుభూతి పొందనివారునూ ఉండవచ్చు. బ్రహ్మానందానుభూతి పొందిన సమ్యగ్దర్శనం కలిగిన వారి వద్దనే వేదశాస్త్రాది విద్యల అధ్యాయనం చేయవలెనని నియమం లేదు. కానీ, బ్రహ్మాత్మాను సంధానుడైన గురువే ఆయా విద్యలనుపదేశించు గురువుగా ఆ శిష్యుని అదృష్టవశాత్ లభిస్తే అంతకన్న గొప్పవిషయము లేదు ఆ శిష్యుడు శ్రుతి స్మృతుల యుక్తమగు విధానములో అన వైదిక విధానములో ఆయా వేదశాస్త్రాదులు, కర్మోపాసన యాజ్ఞిక ములు, తత్తద్దేవతా మంత్రోపాసనలు అపరవిద్యలుగా ఉన్నవన్ని పరావిద్యలోనికి ఎలా సమ్మిళితమౌతాయో ఆయా రహస్యములు ఆ మార్గమున సద్గురువనుగ్రహంతో లభించి ఆ శిష్యుడు క్రమముక్తిని సాధించగలడు.

ఐతే, లోకమున ఏ కార్యము మొదలిడినా గురువందనముచే ప్రారంభించుట వైదిక సంప్రదాయమై ఒప్పారుచున్నది. పైన చెప్పబడిన ఇన్ని విధముల గురువు లుండగా గురువందన శ్లోకము ఈ అన్ని రకముల గురువులకు అన్వయమగునా ఆ గురువందనము చేయు శిష్యుని నమస్కారము సప్రామాణికమైనదేనా అని సందియము కలుగవచ్చు. ఎందుకన బ్రహ్మవిద్బ్రహ్మైవభవతి వంటి శృత్యుక్తములైన వాక్యములచే బ్రహ్మాత్మానుసంధానముచే బ్రహ్మమునెరిగి బ్రహ్మానందమునమజ్జన మొనగు వారు బ్రహ్మమే యగుచున్నారని కదా, అట్లుకాని చోదక బోధక గురువులయందు కూడా గురువు త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మమని రూఢియెట్లను సందేహము కలుగవచ్చు.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవోమహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీగురవే నమః

పంచాయతన శిలలో పంచాయతన దేవతలను భావించినట్లు వేద శాస్త్ర మంత్రోపదేష్టలైన గురువుయందు కూడా బ్రహ్మ – విష్ణు – మహేశ్వరత్వాది భావనలను, పరబ్రహ్మమును భావించి నమస్కరించుటయేనా లేక శ్రీ గురుతత్వము నిత్యమూ, పరోక్షప్రత్యగభిన్న బ్రహ్మాత్మతత్త్వమే యని గుర్తించి నమస్కరించడమా. ఏది నిక్కము? కలశపూజయందుకూడా మనము కలశస్య ముఖేవిష్ణు.. అంటూ మంత్రశ్లోకములు పఠియించిననూ ఆ కలశమునందా ఆ బుద్ధితో ప్రవర్తించుట కానరాదు. ఆ విధమున, గురు నమస్కార శ్లోకమున కూడా అది వాచికార్థమునకే పరిమితమై బ్రహ్మాత్మభావన పొందిన గురువుకే ఈ శ్లోక నమస్కారము చెందును కాని పరోక్ష విద్యలనిచ్చే గురువులకు తన్నమస్కారము చెందునా లేదా అను సంశయము కలగవచ్చు.

నమస్కర్మో యథాబలం.. అను కారికా ప్రమాణము చేతనూ, బ్రహ్మవిద్యా గురుశిష్య సంప్రదాయ రక్షణకోసమను ఆ సాంబశివుని వలన మహా వాక్యోపదేశ మును బొందినశుకమహర్షిగానిండు, వారి వద్ద దీక్షగైకొనిన గౌడపాదులు ఆపరంపరన పుట్టు బ్రహ్మజ్ఞానియైననూ సంప్రదాయ రక్షణకు గోవిందభగవత్పాదు లను గురువునాశ్రయించిన సర్వజ్ఞ శ్రీ ఆదిశంకరులునూ శుకరహస్యోక్త మహావాక్య చతుష్టోపదేశములను పొందినపుడు అదేవిధమున నమస్కరించెను. గురువేరకమునకు జెందిననూ, గురువందన శ్లోకమున ప్రకటించి అవిద్యాతత్త్వమును తొలగించి బ్రహ్మాత్మభావానుసంధానమున మోక్షమును ప్రసాదించు పరబ్రహ్మతత్త్వమౌ గురుత్వభావము తన స్వగురువందు ప్రకటించి నమస్కరించుటయే సిద్ధము. వైదికమార్గమున గురువులయందెన్నిరకములున్ననూ గురువుయందు గురుతత్త్వ దర్శనమందు శిష్యునకు ఎటువంటి అన్యమైన భావములూ, బేధభావమూలేక పరబ్రహ్మతత్త్వమునే ప్రతిష్ఠించి, తనకు గురి కలిగిన గురువుయందు లేశ మాత్రమైననూ అన్యభావనలేక పరబ్రహ్మతత్త్వమునే చూచుచూ నమస్కరించవలెనన్నది సంప్రదాయసిద్ధముగ రూఢి.

ఐతే ఒక్కొక్కచో, శిష్యుడు తన సాధనచే గుర్వనుగ్రహమున గురువుకన్న ఉన్నత స్థాయి పొందుట లోకవిదితమే. బ్రహ్మాత్మానుభవమును బొందిన గురుశిష్య పరంపరలెన్నియో యెందరో అటువంటి జ్ఞానులను మనమెరుగుదుము. కానీ, శిష్యుడు తాను పొందవలసినయున్నత స్థితిని పొందినప్పటికీ, తన గురువుయందు అదే గురుత్వభావనను కలిగి ప్రకటించవలెను. తానే స్వయముగా ఇతరులకు గురువైననూ, తన గురువుయందు పరబ్రహ్మస్వరూపమగు గురుతత్త్వదర్శనమందు ఏ విధమైన అన్యభావన పొందరాదు. ప్రకటించరాదు. దీనిని రూఢి చేయుటకై అథోర్ధ్వ జగత్తులను కూడా తన ప్రబోధ వాఙ్మయముచే (తరువాయి 14వ పేజీలో)

దేశం గర్వపడదగ్గ ఆ ఇద్దరు నాయకులు.....

పివి నరసింహరావు గారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు శ్రీ వాజ్‌పేయి గారు.....

1996... వేదికపై నా ప్రమాణ స్వీకారానికి వచ్చిన ప్రముఖులతో కరచాలనం చేయడానికి వెళ్ళాను.ముందుగా పి వి నరసింహ రావు గారి దగ్గరకు వెళ్ళి చేయి అందించాను. వారూ చేతులు కలిపారు...ఐతే ఎవరికీ తెలియని విచిత్రం ఒకటి జరిగింది అక్కడ.

మా ఇద్దరి చేతులు కలిసినప్పుడు ఒక “చీటీ” పివి నరసింహరావు గారు నా చేతిలోకి పంపారు. అంతే చాకచక్యంగా అది నా జేబులోకి వెళ్ళిపోయింది.

తరువాత అది తెరిచి చూశాను “ఆయుధం సిద్ధంగా ఉంది. ఎప్పుడయినా పరీక్షించుకోవచ్చు” అని ఉంది.

అటల్ బిహారీ వాజ్‌పేయి గారు స్వర్గీయ పివి నరసింహరావు గారు చనిపోయాకా సంస్మరణ సభలో “భారత దేశ అణుబాంబు సామర్థ్యం” వెనుక ఉన్న అసలు వ్యక్తి గురించి చెప్పిన సత్యం.అందరూ అనుకున్నట్టు అణు సామర్థ్యం క్రెడిట్ పూర్తిగా భారతీయ జనతాపార్టీ ది కాదని దానివెనుక పివి ఉన్నారని. ఇది కాంగ్రెస్‌కు కుడా తెలియదని ప్రపంచానికి చాటిచెప్పిన సంఘటన.

పివి నరసింహరావు గారు అంటే పాములపర్తి వేంకట నరసింహరావు గారు ఈయన స్వచ్ఛమైన 16 అణాల తెలుగువారు... ఇదే ఈయనని ఏకాకిని చేసింది.

ప్రపంచం గుర్తించాకా గానీ భారతీయులు గుర్తించని జాతి వజ్రం ఒక తత్వవేత్త, ఒక బహుభాషాకోవిదుడూ, ఒక గొప్ప ఆర్థికవేత్త, మహ రాజనీతిజ్ఞుడు, స్వాతంత్ర్య సమరయోధుడూ అయినా కూడా ఎక్కడ ఈయన పేరు బయటికి వస్తే నెహ్రూ ప్రతిష్ఠని మించిపోతాడని భయపడి సోనియా అనుయాయులచే ఈ సూర్యుడికి “అరచేయి” అడ్డం పెట్టడం జరిగింది. అసలు భారత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడాలంటే పివి గారికి ముందు, పివి గారి తరువాత అని చెప్తారు ప్రపంచ ఆర్థిక నిపుణులు. “రాజకీయాల్లో శాశ్వత శతృత్వం, శాశ్వత మిత్రుత్వం ఉండదు” అని ఒక సందర్భంలో ఈయన చెప్పిన సమాధానం ఇప్పటికీ పతాక శీర్షికలను అంటుతూ ఉంటుంది.

ఈయన భారతదేశానికి ఆర్థిక సంస్కరణల పితామహుడు.

1991:- మోయలేనన్ని అప్పుల భారంతో దేశ ఖజానా దివాళా తీయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పివి ప్రపంచం నివ్వెరపోయేంతగా సంస్కరణలను ప్రవేశపెట్టి “పడి లేచిన కెరటం” అని ఆర్థిక రంగంలో విమర్శకులచే ప్రశంశలు అందుకున్న మేటి నగధీరుడు.

ఈయన చేసిన సంస్కరణల కారణంగా దేశీయ బాంకులు ఆర్థిక మంత్రిత్వ శాఖ నుండీ భారతీయ రిజర్వ్ బాంక్ నియంతృత్వంలోకి తెచ్చారు.ఇలా తేవడం వల్ల 1992 లోనే కాదు...ఈయన పోయాకా కూడా 2008 లో వచ్చిన ఆర్థిక మాంద్యం భారతీయ బాంకులకు అంటకుండా కాపాడుకోగలిగాము. 1991 వరకూ ఫారెన్ పాలసీ అంటే అమెరికా , బ్రిటన్ వగైరా దేశాల పెత్తనానికి వంతపాడడమే...

“మనం విలువనిచ్చే చోటు కన్నా మనకి విలువ ఉండే చోటు మనకి శ్రేయస్కరం” అని చెప్పి "LOOK EAST POLICY" అని భారతదేశానికి పరిచయం చేసిన గొప్ప రాజనీతిజ్ఞుడు. దీనివల్ల మన సంస్కృతికి దగ్గరగా ఉండే ఇండోనేషియా, జపాన్ , తైవాన్ , మయన్మార్ లాంటి చిన్న చిన్న దేశాలతో వాణిజ్యం అన్ని రకాలుగా లాభించి భారతదేశాన్ని నాయకదేశంగా ఆసియా ఖండంలో నిల్చునేట్టు చేసింది. గొప్ప విద్యావేత్త ఐన పివి నరసింహారావుగారు 16 భాషలలో పండితుడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ గారి “వేయి పడగలు” ని హిందీ లోకి అనువదించారు అంతేకాదు వందపుస్తకాలు పైచిలుకు వీరు వెలువరించారు వీరి ఆత్మకథలో ఎంతో లోతైన విషయాలను విలువలను ప్రస్తావించారు ఈయన.

- జై హింద్ -

(13వ పేజీ తరువాయి) కప్పి వేసిన జగద్గురువులు సర్వజ్ఞులు సాక్షాత్ కైలాస వాసియగు దక్షిణామూర్తి స్వరూపులు శివశక్తి అవతారులు శ్రీశ్రీశ్రీ శంకర భగవత్పాదులు సారతత్వోపదేశమను ఉపదేశ పూర్వక శ్లోకములను మనకు ప్రసాదించి మార్గదర్శనము చేసినారు.

సార తత్వోపదేశః

గురుబ్రహ్మా స్వయం సాక్షాత్ సేవ్యో వన్ద్యో ముముక్షిభిః
నో ద్వేహనీయ ఏవాయం కృతజ్ఞేన వివేకినా!!

గురువు సాక్షాత్తుగ పరబ్రహ్మస్వరూపుడు, ముముక్షువులైన శిష్యపరివారముచేత సేవనీయుడు, వారిచే వందనీయుడు. కృతజ్ఞుడు వివేకవంతుడు ఐన శిష్యుడు, తన గురువునకెన్నడూ క్లేశము కలిగించు కార్యములను నిర్వహించడు.

యావదాయుస్త్రయో వన్ద్యో వేదాన్తో గురురీశ్వరః
మనసా కర్మణా వాచా శ్రుతేరేవైష నిశ్చయః!!

జీవించి ఉన్ననాళ్ళు మనస్సు వాక్కు కాయములచేత, వేదాంతములకు (ఉప నిషత్ విద్య - అద్వైత విద్య), గురువునకు, ఈశ్వరునకు నిక్కముగా నమస్కారము చేయవలసినది. అని శ్రుతి నిశ్చయము చేసి ఉపదేశించుచున్నది.

భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం నకరిచిత్
అద్వైతం త్రిషులోకేషు నాద్వైతం గురుణా సహ!!

అద్వైత భావమును ఎప్పుడూ కలిగి ఉండవలెను. కానీ ఎన్నడూ క్రియలో అద్వైత బుద్ధిని చూపవద్దు. ముల్లోకములయందూ అద్వైతబుద్ధిని ప్రదర్శించవచ్చు గానీ, ఎన్నడూ గురువుపట్ల అద్వైత బుద్ధిని ప్రదర్శింపరాదు.

గురువుకు తాను పొందిన అద్వైత స్థితివల్ల గురుశిష్యులైన తామిద్దరూ మాత్రమే కాదు సమస్తమూ ఒకటే అన్న భావనలో ప్రతిష్ఠితుడు. కానీ, శిష్యుడు కూడా తన గురువువలె అద్వైత స్థితిలోనే ప్రతిష్ఠితుడైనా గురువు వేరు - నేను వేరు కాదు మేమిద్దరమూ ఒకటే అంతా ఒకటే అను అద్వైత బుద్ధిని క్రియారూపంలో ప్రదర్శించ రాదు, ఈ శరీరం ఉన్నంత వరకు శిష్యునికి గురువు వందనీయుడే, పూజనీయుడే.

“భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం నకరిచిత్”

శంకరుల అతి ముఖ్య సందేశములలో మనం విధిగా ఆచరించవలసిన వాటిలో ఇదీ ప్రముఖమైనది, అద్వైత విమర్శకులకు, అద్వైతంలో ఉన్నామనుకున్ని మాట్లాడేవారి మాటలకు శంకరులు ఏనాడో భావనలో ఎలా ఉండాలో క్రియలో ఎలా ఉండాలో చెప్పారు.

భావమునందు ఎల్లప్పుడూ అద్వైతాన్నే అనుష్ఠించవలెను అంత మాత్రమున ఈ శరీర ధర్మాన్ని వదలరాదు కదా, ఈ జీవనం ఉన్నంత వరకూ ఈ శరీరం ప్రకృతి పరంగా వేరుగా కనపడుతుంది. ఈ శరీరంలో ఉన్నందుకు దాని ధర్మాన్ని అది నిర్వర్తించాలి, అద్వైత సిద్ధివల్ల సమస్తమూ ఒకటిగా స్థిరీకరింపబడినా, అది ఆంతరంలో, భావంలో ఉండాలి తప్ప క్రియారూపంలో కాదు, భావనల వల్ల క్రియాదోషం జరగరాదు. ఒకవేళ అంతగా అద్వైతానందానుభూతిలో పండినా గురువులయందు ఆ బుద్ధి ప్రదర్శించక గురువుని తనకన్న వేరైన అధికునిగానే యెంచి నమస్కరించాలి.

జయ జయ శంకర హర హర శంకర
జయ జయ శంకర పాలయమాం!

- శంకర కింకర
(శ్రీ అయ్యగారి సూర్య నాగేంద్ర కుమార్ శర్మ)

దేవీపురం - అభినవ మణిద్వీపం

విశాఖపట్నానికి దగ్గరలో ఉన్న సబ్బవరం గ్రామానికి 5 కి.మీ దూరంలో, నారపాడు గ్రామశివార్లలో తొమ్మిది కొండల నడుమ,పచ్చని తోటల మధ్య, దేవీపురంలోని శ్రీచక్రాలయంలో "సహస్రాక్షి" గా శ్రీరాజరాజేశ్వరీ దేవి భక్తులకు దర్శనమిస్తోంది.

ఇక్కడి ఆలయం అంతా ఒక శ్రీచక్రమే. ఇంత పెద్ద శ్రీచక్రాలయం ప్రపంచం మొత్తంలో ఇంకెక్కడా లేదు.

"నాకు ఇల్లు కట్టించు" :

న్యూక్లియర్ ఫిజిక్స్ లో డాక్టరేట్ చేసి, ముంబాయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్త గా పనిచేస్తున్న నిష్ఠల ప్రహ్లాద శాస్త్రిని ఈ ఆలయ నిర్మాణానికి అమ్మవారు ఎన్నుకుంది.

ఒకసారి ప్రహ్లాదశాస్త్రి హైదరాబాద్‌లో బిర్లామందిర్‌కు వెళ్ళి, బాలాజీని దర్శించి, ఒకచోట ధ్యానం చేసుకుంటుండగా, వారికి బాలాజీ స్త్రీ రూపంలో త్రిపురసుందరిగా దర్శనమిచ్చి "నాకు ఇల్లు కట్టించు" అని పలికి అంతర్ధానమైనట్లనిపించింది.

అప్పుడే కాకుండా మరొకమారు వారికి ధ్యానసమయంలో దర్శనమిచ్చి "ఈ కార్యం నీ వల్లే నెరవేరాలి. జాగ్రత్తగా, దోషరహితంగా, ప్రజలందరికీ మేలు కలిగేలా శ్రీదేవి నిలయం నిర్మించు" అని ఆదేశించింది.

ప్రహ్లాద శాస్త్రి తమ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వస్థలమైన విశాఖపట్నం వచ్చారు.

ఆలయం ఎక్కడ కట్టాలి ?

ఆలయం నిర్మించాలనే సంకల్పంతో 1982 లో 108 రుత్విక్కులతో 16 రోజులు దేవీయాగం చేశారు.

ఆ యజ్ఞంలో ఆలయం నిమిత్తం మూడు ఎకరాల భూమి యజ్ఞప్రసాదంగా లభించింది. ఈ విధంగా శ్రీ చక్రాలయ నిర్మాణ స్థలాన్ని త్రిపురసుందరీ దేవి స్వయంగా ఎంచుకుంది.

తొమ్మిది కొండల మధ్య, రమణీయంగా, ప్రశాంతంగా ఉన్న ఆ స్థలంలో ప్రహ్లాదశాస్త్రి తిరుగుతూ ఉండగా, ఒకరోజు ఒక అగ్ని గుండంలో మెరుపులతో మెరిసే శరీరంతో 16 ఏళ్ళ అమ్మాయిలా దేవి కనిపించింది. పూజలు అందుకుంది. తనకు అక్కడే ఇల్లు కట్టాల్సిందిగా ఆదేశించింది.

ఆ ప్రదేశంలో తవ్వితే, అగ్నిలో కాల్చిన గుర్తులున్న పంచలోహ శ్రీచక్ర మేరువు లభించింది. దాని గురించి విచారించగా సుమారు 250 ఏళ్ళ క్రితం అక్కడ గొప్ప యజ్ఞం జరిగినట్లు తెలిసింది.

ఆ శ్రీచక్రమేరువును మళ్ళీ భూమిలో నిక్షిప్తం చేసి దానిపై కామాఖ్యపీఠం ప్రతిష్టించారు. ప్రక్కనే వున్న ఎత్తైన కొండమీద శివాలయం కట్టించారు.

ఆలయ సొగసులు :

ఈ దేవీపురం ప్రాంతంలోని శ్రీచక్రమేరునిలయం 108 అడుగుల పొడవు, 108 అడుగుల వెడల్పు, 54 అడుగుల ఎత్తు కొలతలతో నిర్మితమైంది.

ప్రహ్లాదశాస్త్రి ఏకాగ్రతతో, సౌందర్యలహరిలో ఆదిశంకరులు సూచించిన విధంగా,

లలితా సహస్రనామ స్తోత్రంలో వాగ్దేవతలు వర్ణించిన విధంగా ఉండేటట్లు, ఆలయ నిర్మాణం పూర్తి చేయించారు. 1990 లో జూన్ 4 వతేదీన మూలవిరాట్ 'సహస్రాక్షి' విగ్రహ ప్రతిష్ఠ జరిగింది.

శ్రీ చక్రాలయంలో బిందు స్థానంలో (మూడో అంతస్తు) పవళించిన సదాశివుని మీద కూర్చున్న, నిలువెత్తు ఆ విగ్రహం కళ్ళలోకి చూస్తుంటే, జీవకళ ఉట్టిపడుతూ, జీవితం ధన్యమవుతుంది.

ఆమె చుట్టూ, క్రింది అంతస్తులలో, నక్షత్రాలను పోలిన ఆవరణలు, వాటిలో ఆమె పరివార దేవతలు ఉన్నారు.

నిష్ఠల ప్రహ్లాద శాస్త్రికి ధ్యానంలో గోచరించిన విధంగా ఖడ్గమాల దేవతలకు రూపకల్పన చేసి గంధర్వ మాతృమూర్తులుగా 68 విగ్రహాలను భూమి మీద,

10 విగ్రహాలను మొదటి అంతస్తులోను, రెండో అంతస్తులో 10 విగ్రహాలను సిమెంటు చేసి పెట్టారు.

మిగిలిన విగ్రహాలను పంచలోహాలతో చేయించి మూడో అంతస్తులో అష్ట దళ పద్మంలో ఉంచారు.

ఇవికాక భూమిమీదే బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మాహేంద్రీ, చాముండీ, మహాలక్ష్మీ, బాలాజీ, కాళియమర్దన చేస్తున్న శ్రీకృష్ణుడు ఈ పది విగ్రహాలనూ రాతితో చెక్కించి ప్రతిష్టించారు. ఈ విగ్రహాలకు భక్తులు అభిషేకాలు చేస్తారు.

ఈ దేవీ పురాన్ని శ్రీదేవీ భాగవతంలో వర్ణించిన 'మణిద్వీపం' గా రూపొందించాలని గురూజీ (ప్రహ్లాద శాస్త్రి) ఆకాంక్ష. ●

ఓ బామ్మగారి ఉవాచ!

ఆవకాయ పచ్చడి ఏంట్రా... మీ సంకర భాషని పాతెయ్య. అసలు పచ్చళ్ళంటే ఏంటో, తొక్కు అంటే ఏంటో, ఊరగాయ అంటే ఏంటో తెలియకుండా ఏం బతుకుతున్నారు దిక్కుమాలిన గోలా? ఉప్పుకారాలు మిశ్రమించి నూనె కలిపి ఊరేస్తే ఊరగాయ అంటారు. ఆవకాయ, మాగాయా మెంతికాయా వంటివి. దంచి చేసిన దాన్ని తొక్కు అంటారు. చింతకాయ వంటివి.తరిగి, వాడ్చి, లేదా నానా పెట్టి రుబ్బి చేసేవి పచ్చళ్ళు. కొబ్బరి పచ్చడి, గోంగూర పచ్చడి, కొత్తిమీర పచ్చడి టమేటా, కంది పచ్చడి ఇటువంటివి. అంతే గానీ ప్రతీదీ పచ్చడి అనరు. మీ మొహాలు సంతకెళ్ళ. తిని ఏడవడం రాకపోతే పోయింది అసలు దేన్ని ఏం అంటారో కూడా తెలిసి చావక పోతే ఎలాగ్రా. ఇంతకీ కొత్తావకాయలో మీగడ తరగ నంజుకు తింటున్నారా. ఒక రోజు మజ్జిగ పులుసెట్టుకుని మాగాయా టెంక నంజుకు తిని ఏడవండి. మహా రంజుగా ఉంటుంది. వెధవ సోకులకు పోకుండా పెద్దరసాల పండు పెరుగులో వేసుకు జుర్రుకు తినండి. ఏ కాలం పండు ఆ కాలం లో తినాలి.రోజూ మూడు పూటలా మజ్జిగ తాగి అఘోరించండి, వేడి చేసి ఏడవకుండా ఉంటుంది.

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

కలౌ వేంకటనాయకః

ప్రభుత్వాలు ఎన్ని మారినా, మనలను ఎలా పరిపాలించినా, అసలైన నాయకుడు తిరుమలలోనున్న శ్రీ వేంకటేశ్వరుడు అనేదే కలౌ వేంకటనాయకః' అనేదానిలోని అర్థం. గత కొద్దికాలంగా ఆ దివ్యక్షేత్రంలో రాజకీయపరిణామాలు, అన్యమతస్థుల నియామకాలు, వారి చొరబాటు మొదలైన అనేక కారణాల వల్ల ఎందరో భక్తులు వాటిని నిరసించడం, కొన్ని(హిందూ)సంఘాల వారు చర్చలు, వినతి పత్రాలు సమర్పించడం, శాంతియుత ఉద్యమాలు జరిగాయి.. జరుగుతున్నాయి. మీడియా వారు కూడా చర్చాకార్యక్రమాలు పెట్టి రేటింగ్ పెంచుకోవడం జరుగుతోంది. ఇదంతా ప్రజలు చాలామంది చూస్తున్నారు.. కలియుగ వైకుంఠమైన వేంకటాద్రిలో ఇంత దారుణమా? అని అనుకునేవారు కొందరైతే, అన్నిమతాలు ఒక్కటే కదా ఈ హిందూసంఘాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయి అనేవారు, మనకెందుకులే ఎవరేం చేసినా శ్రీ వేంకటేశ్వరుడు చూసుకుంటాడు అనుకునేవారు అధికంగా ఉన్నారు. ఒకానొక ఉదాసీనత. దీనికి మానసికంగా బాధపడుతూ కళ్ళనీరుపెట్టుకునే భక్తులు కూడా లేకపోలెదు. కానీ వారి సంఖ్య అతిస్వల్పం అనడంలో సందేహం లేదు.

పరమతస్థులు ఈ దేవస్థానంలో ఉద్యోగస్థులుగా ఉన్నంతమాత్రాన తప్పేముంది? అనే హిందువులు కూడా లేకపోలేదు. దానికి సమాధానం కాస్త విజ్ఞతతో ఆలోచిస్తే ఎవరికి వారికే లభిస్తుంది.

- ✳ దేవాలయం అనేది హిందూమతానికి సంబంధించినది. ఒక మతానికి సంబంధించిన దానిని కూడా మతాతీతంగా చూడడం జరగని విషయం..తప్పిదం కూడా.
- ✳ అన్యమతస్థులు వారు పవిత్రగ్రంథంగా చెప్పుకునే దాని ప్రకారం విగ్రహారాధన శిక్షార్హమైనది. దానిని ఆరాధించేవారు శిక్షార్హులు. కాబట్టి వారెవరికి దైవస్పృహ, అర్చకులపైన గౌరవం ఉండే అవకాశం లేదు సరికదా చులకన భావం కూడా ఉంటుంది.
- ✳ ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయంగా దీనిని పరిగణిస్తూ, ఆదాయం మాత్రమే చూస్తూ అది దేవ ఆదాయమన్న స్పృహ వారికి ఏ మాత్రం ఉండదు.
- ✳ ఆదాయ వ్యయాలపైన మాత్రమే దృష్టి పెట్టడం వల్ల కాలక్రమేణా శాస్త్ర నిబంధనలను మీరి ప్రసాదాలు మొదలైనవాటిలో కల్తీ చేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు.
- ✳ తప్పు జరుగుతోందన్న ఆవేదన కలిగితే, పరిష్కారాలు ఆలోచించవచ్చు...
- ✳ తిరుపతి వెళ్ళేవారికి మన మొక్కుబడులు తీరుస్తున్న ఒకానొక విగ్రహమన్న భావన ఉందా? దైవమనే భావన ఉందో..ఒకసారి ఆలోచించుకోవాలి.
- ✳ దైవమే రక్షించుకుంటాడు అనుకునేవారు కూడా ఉన్నారు. వైకుంఠంలోనున్న స్వామి అక్కడకు వచ్చి ఉన్నది కొలుచుకునేవారి కోసమే కాని తనకోసం కాదు. ఎవరు ఎలా కొలుచుకుంటే వారినలా అనుగ్రహించే స్వామి.
- ✳ మనకెందుకులే అనే ఉదాసీనత చూపించేవారిని... 'నాకెందుకులే' అని ఆ ఏడుకొండలవాడు కూడా ఒక్కసారి అనుకుంటే!!!....
- ✳ ఏ శుభకార్యం జరగాలన్నా.. ఒక ఉద్యోగం రావాలన్నా.. మంచి సంతానం కలగాలన్నా.. అతనినే నమ్ముకునే వారి గతి? ఎందరిని ఎన్ని విధాల ఆదుకున్నాడో... అదుకుంటున్నాడో.. ఎవరికి వారు కాస్త ఆలోచిస్తే అర్థమవుతుంది. అవసరాలకు మాత్రమేనా దేవుడు? భక్తులమనుకునేవారు ఒక్కసారి ఆలోచించండి. అక్కడకి వెళ్ళి దర్శనం చేసేసుకున్నంత మాత్రాన భక్తి అనిపించుకోదు. మన దర్శనాలు స్వామికి అవసరం లేదు. మనం ఇచ్చే కానుకలు అంతకన్నా అక్కర్లేదు. ఆయనకు కావాల్సింది.."భక్తి" అంటే స్వామిపై "ప్రేమ".

మనమేం చెయ్యాలి?

- ✳ వేంకటేశ్వరుడు మనకోసం అక్కడ ఉండి కాపాడుతున్నాడన్న కృతజ్ఞతా భావాన్ని పెంచుకోవాలి.
- ✳ మనం ప్రార్థిస్తే కోరికలను తీర్చే భగవంతుణ్ణి, ఆలయ వ్యవస్థ మార్చమని సామూహికంగా వేడుకోవాలి. మనఃస్ఫూర్తిగా ప్రార్థిస్తే ఆత్మబంధువైన స్వామి తప్పక నెరవేరుస్తాడు. మనం కనీసం కోరుకోకుండా దేవుడే చూసుకుంటాడులే అనే నిర్లిప్తత మాత్రం తగదు. అనేక అవతార గాథల్లో కూడా దేవతలు/భక్తులు ప్రార్థిస్తేనే కానీ భగవంతుడు అవతరించలేదు.
- ✳ సంబంధిత నాయకులను మార్పు వచ్చేదాక ప్రశ్నిస్తూనే ఉండాలి.
- ✳ మీడియాలో హిందూ వ్యతిరేకశక్తులు ఎంత ప్రచారం చేసినప్పటికీ అందులో వాస్తవాలను గ్రహించడానికి ప్రయత్నించాలి.
- ✳ ఈ ప్రార్థన ఎవరి శక్తిమేరకు వారు చెయ్యాలి. సమర్థత ఉన్నవారు సుదర్శనయాగం వంటివి సంకల్పపూర్వకంగా చెయ్యవచ్చు.
- ✳ నిత్యము చేసే స్తోత్ర–జపాదులలో కొంతశాతం ధారపోయవచ్చు.
- ✳ విష్ణుసహస్రం వంటివి సామూహికంగా పారాయణలు చెయ్యవచ్చు.

ఇకపై మన మొక్కుబడులలో కృతజ్ఞతాపూర్వకంగా ఆలయవ్యవస్థలో మార్పుకోసం మొక్కుకోవడం కూడా ఒక భాగం కావాలి. వేంకటేశ్వరుడే మన నాయకునిగా గుర్తించి, ఆలయవ్యవస్థలో సానుకూల మార్పు వచ్చిననాడే మనందరికీ రక్ష... ●

– సామవేదం షణ్ముఖ శర్మ

ప్రముఖాంధ్ర శ్రేయోభిలాషులకు,

నాన్నగారు అమెరికా ప్రయాణం తరువాత ప్రముఖాంధ్ర సంపాదకత్వం బాధ్యతలు తాత్కాలికంగా నామీద పడ్డాయి. ఏదో ఈ రెండు నెలలు ఆయన రాసిన మేటర్ కొంత వరకూ వున్నందువల్ల ఏదో మేనేజ్ చేసేసా. వచ్చే నెలకు అసలు మేటర్ లేదు. ఇంతవరకూ నాన్నగారు పంపనూ లేదు. నేనే రాయాలి, ఏదో నాకు తోచినది రాస్తా, కాస్త సరిపెట్టుకోండి తప్పొప్పులు వుండొచ్చు సర్దుకోండి. ఆయనంత గొప్పగా రాయలేకపోయినా ఫర్వాలేదులే అనిపించేట్టు రాస్తాననే ధీమా వుంది. ఆపై ఆ తెలుగు తల్లి దయ. రాబోవు సంచిక జూలై వివేకానందుడి ముఖచిత్రంతో ఆయన్ను తలుచుకుంటూ ప్రారంభిస్తాను. ఆయన స్ఫూర్తితో ఉత్సాహంగా రాయడానికి ప్రయత్నిస్తా. ఇక ఆయనమీద భారం వేసి రాయడం ప్రారంభిస్తా. గత పదేళ్ళలో నాన్నగారు నాలుగైదుసార్లు అమెరికా వెళ్ళినప్పుడు అక్కడినుంచి మేటర్ పంపించారు. కానీ ఇప్పుడు ఆయన ఆరోగ్యరీత్యా ఎక్కువగా రాకలేకపోతున్నారు. మనసు వెళ్ళినంత వేగంగా చెయ్యి కదలటం లేదు. శరీరం సహకరించటం లేదు. అయినా పత్రిక నిలుపకూడదు. నేనెక్కడ పత్రిక నడపలేమోనని ఆయన ఆందోళన. ఆర్థికంగా వున్న ఇబ్బందులు కాస్త, ఇంకొకటి సరైన సమయానికి ఆయన మేటర్ అందించలేక పోతున్నాను అని ఆదుర్దా. అయినా ఆ దేవుడి దయ వల్ల, సరస్వతిదేవి అనుగ్రహం వల్ల, తెలుగు తల్లి చల్లని చూపు వల్ల ఈరోజు వరకూ గత 24 సంవత్సరముల 6 నెలలు నిరాటంకంగా తీసుకుని వస్తూనే వున్నాం. ఇంతవరకూ ఎప్పుడూ, ఎట్టి పరిస్థితులలోనూ ఆగిపోలేదు. అంతపెద్ద వానలో ప్రెస్ మునిగి పోయినప్పుడు పత్రికను తీసుకునివచ్చాం. ఎన్ని వ్యయ ప్రయాసలైనా ఓర్చుకున్నాం. ఆయన ఆరోగ్యరీత్యా గత నాలుగేళ్ళుగా ఎక్కడికి తిరగలేక ఇంటిపట్టునే వుండిపోయారు. అందువల్ల ఆయన ఎవ్వరినీ ప్రకటనలు రూపేణా సహాయం అడగలేకపోయారు. నాకు ఆ చొరవ లేదు. ఇన్ని ఇబ్బందులలోను ఆ పత్రిక వస్తోంది అంటే దానివెనుక తప్పకుండా భగవత్ కృప వుందనేగా.

రాబోయే 2019 జనవరికి ఈ పత్రిక ప్రారంభించి 24 సంవత్సరాలు పూర్తయ్యి 25 సంవత్సరంలో అడుగిడుతోంది. అంటే రజతోత్సవ సంవత్సరం. ఈ సందర్భంగా ఈ పత్రికను అందుకుంటున్న మీరందరూ ఏదో కొంత ధన సహాయాన్ని అందించి పత్రికకు చేయూతనిస్తారని ఆశిస్తున్నాను. వచ్చే సంచికలో మరిన్ని విశేషాలు తెలియజేస్తాను.

ఇట్లు
మీ
గోటేటి వెంకటేశ్వరరావు
సన్నాఫ్ గోటేటి శ్రీరామారావు

జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

మనమందరం కష్టపడి శ్రమించాలి మనందరి కృషిపైన భావిభారత భాగ్యోదయం ఆధారపడి వుంది. - స్వామి వివేకానంద

భారతదేశం ఒక అద్వితీయ దేశం. ఎన్నో విదేశీ దండయాత్రలకు గురైనా తనదైన సంస్కృతిని నిలబెట్టుకుంది. తన ఉనికిని పోగొట్టుకోలేదు. ఐదు వేల ఏళ్ళ చరిత్రలో ఎప్పుడు భారతదేశం తనకు తానుగా ఏ దేశంపైనా దండయాత్ర చెయ్యలేదు. ప్రపంచం మన మాతృభూమికి ఎంతో ఋణపడి వుంది. ప్రతి దేశం క్షమామయుడైన హిందువుకు ఋణపడినంతగా మరే జాతికి ఋణపడి లేదు. గ్రీకు దేశం పుట్టకముందు నుంచి, రోమ్ నగరాన్ని ఊహించక ముందునుంచి ఐరోపా జాతుల వారు అడవుల్లో తిరుగుతున్న కాలంలోనే భారతదేశం నుంచి ధర్మ ప్రచారాలు సాగాయి. మన దేశ పురాణ గాథల్లో ప్రతి మాట ముందర ఒక శాంతి సందేశం, ప్రతి వాక్కూ ఒక అనుగ్రహ పూర్వకంగా పలికాయి. సామరస్య భావం గురించి, మనిషిలోని దివ్యత్వం గురించి మన భారతదేశం కొన్ని వేల ఏళ్ళకు ముందే గుర్తించింది.

అటువంటి భారతదేశాన్ని, దాని సంస్కృతి, సాంప్రదాయాన్ని దైవం పట్ల వున్న విశ్వాసాన్ని ముఖ్యంగా హిందూ జాతిని నాశనం చెయ్యడానికి కుట్ర జరుగుతూ వుంటే, మనకి ఏమి పట్టనట్టు వూరుకొన్నాం. ఒకప్రక్క తిరుమల కొండపై అన్య మత ప్రచారం జరుగిందని తెలిసినా, లేదని బుకాయిస్తున్నాం. అయ్యప్ప భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీసినా వూరుకున్నాం. మరో ప్రక్క హిందు జాతిని బాంబులు పెట్టి చంపుతూ, కాశ్మీర్‌లో హిందు కుటుంబాల్ని మాత్రమే హత మారుస్తూ వుంటే అందరం నోరుమూసుకుని వూరుకొన్నాం. శంకరా చార్యులు వారు చెప్పినట్లు "దుర్భలాన్ అజితేంద్రి యాన్ ప్రాప్య యోగో నష్టః" అంటే ధర్మం అనేది ఆచరణశూన్యులు, అజితేంద్రియులు (అంటే సంయమనం లేనివారు) దుర్భలుల చేతిలో పడి నశిస్తోంది. దీనిని సమాజంలోని ఏ పెద్దలు నోరు తెరిచి గర్హించకపోవడం ఆశ్చర్యం. అవమానకరం. వారు ఎంత పెద్దవారలైనా సరే వారి పేరుకి వెనుక ఎన్ని పట్టాలు (డిగ్రీలు) వున్నా, ఎన్ని హోదాలు వున్నా, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామిజీలు ఎంద రుండి ఏం లాభం వారందరు ద్రౌపది వస్త్రాప హరణం జరుగుతున్నప్పుడు కౌరవ సభలోని నోరు మెదపని భీష్మ, ద్రోణాచార్యులకు సమమే.

రాయప్రోలు సుబ్బారావు గారన్నట్లు

ఏ పూర్వపుణ్యమో ఏ యోగ బలమో
జనియించినాడు నీ స్వర్గ ఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నిను మోచె ఈ తల్లి కనక గర్భమున.

ఇటువంటి ఈ స్వర్గభూమిలో జన్మించి ఆ భారతమాత గర్వించేలా జీవించాలి కాని, ఆ తల్లి మనస్సు నొప్పింప కూడదు.

ఎవరికి లేని బాధ నీకెందుకు అని నన్ను అందరూ వారిస్తున్నా నా మనసులోని మాట వ్రాయక తప్పటంలేదు.

* * *

వ్యాకరణం (తెలుగు) తెలిసిన వారికి విందు భోజనం

ఈ సంఘటన చాలా పాతకాలం నాటిది. ఒక పండితుడు వేరొక పండితుడి గ్రామానికి బస్సులో వస్తున్నానని కబురు చేశాడు. తన ఇంటికి వస్తున్న పండితుడిని ఆహ్వానించి, ఇంటికి తీసుకెళ్లడానికి ఎడ్లబండి కట్టుకొని బస్సు వచ్చే చోటికి వెళ్లాడు.

బస్ స్టాండ్ గ్రామానికి 3, 4 మైళ్ళ దూరంలో ఉంది. అందువలన, వేరే బండివాడిని తీసుకురాకుండా, తానొక్కడే ఎద్దులను కట్టి, బండి తోలుకుంటూ బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు దిగిన సోదర పండితుడిని సాదరంగా ఆహ్వానించి, బండిలో కూర్చోబెట్టుకొని తన గ్రామానికి బయలుదేరాడు.

పల్లెటూరుకు వెళ్లే త్రోవ కాబట్టి, అంత బాగా ఉండదు. నల్లేరు మీద బండి నడక కాకుండా, ఎగుడు దిగుడు బండల మీద త్రోవ వల్ల, ఎద్దుల బండి బాగా కుదుపులతో వెళుతూవుంది. కుదుపులు ఎక్కువ ఉండడం వలన పొరుగూరి నుంచి వచ్చిన పండితుడు 'అబ్బబ్బ వెధవ బండి' అన్నాడు.

దానికి, బండి యజమానియైన పండితుడు, ఏమండీ మీరంటున్నది షష్టీ తత్పురుషమా! లేక కర్మధారయమా! అన్నాడు నవ్వుతూ. షష్టీ తత్పురుషము అయితే 'వెధవ యొక్క' బండి అనే అర్థము వస్తుంది. అదే కర్మధారయమైతే 'వెధవ (యైన) బండి' అనే అర్థము వస్తుంది. (బండి యొక్క యజమాని వెధవనా? బండి వెధవదా?).

దానికి పొరుగూరి పండితుడు నవ్వుతూ, "యేదీ కాదు చతుర్థీ తత్పురుషము లెండి" అన్నాడు. (అంటే వెధవ కొఱకు బండి) అని. ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు. ఆ కాలంలో పండితులు మాటల్లో కూడా అలాంటి చెణుకులు విసురుకొని ఆనందించేవారు.

* * *

Compliments from

Sri Krishna Bhat

When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE

HOTEL WOODSIDE

E.Car Street, Tirupathi. Ph : 2284464